ప్రజాశక్తి

బుధవారం 24 సెప్టెంబర్ 2025 5 శ్రీ సత్యసాయి






నాటిన రాళ్లను తొలగిస్తున్న అధికారులు

అరకొర కూడా నాసిరకమే..!

◆ ఆర్ఎస్‌కెల్లో నాసిరకం యూరియా
◆ ఎర్రగా గడ్డలు కట్టిన బస్తాలు
◆ లబోదిబోమంటున్న రైతులు
◆ యూరియా పంపిణీ లెక్కలు వెల్లడించని యంత్రాంగం



ఎర్ర రంగులో గడ్డలు కట్టిన యూరియా

జిల్లాలో యూరియా కోసం రైతుల అవస్థలు కొనసాగుతూనే ఉన్నాయి. 'పంట ఎండిపోతోంది ఒక్క బస్తా యూరియా అయినా ఇప్పించండి సారూ' అంటూ అన్నదాతలు వేడుకుంటున్నారు. రైతులు రోజుల తరబడి ఎదురు చూస్తే ఒకటి, రెండు బస్తాల యూరియా ఇస్తున్నారు. ఆర్ఎస్‌కెల్లో ఇచ్చిన యూరియా కూడా నాశిరకంగా ఉండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఇచ్చేందే అరకొర అదీ నాశిరకమేనా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

నాణ్యతలేని యూరియా

కళ్యాణదుర్గం వ్యవసాయడివిజన్‌లో ఆర్ఎస్‌కెల ద్వారా రైతులకు నాణ్యతలేని యూరియాను అంటగట్టినట్లు బాధిత రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న రాష్ట్రీయ కెమికల్ ఫర్టిలైజర్స్ (ఆర్‌సీకే) పేరుతో అందజేసిన బస్తాలలో ఏమాత్రం నాణ్యతలేన్నట్లు కనిపిస్తోంది. ఆర్ఎస్‌కెల్లో ఆర్‌సీకే బస్తాలలో యూరియాను పరిశీలిస్తే ఎర్రగా, నల్లగా, గడ్డలుకట్టి బస్తాను తాకడానికి కూడా వీలులేనంత దారుణంగా ఉంది. ఈ బస్తాలు విప్పిచూసిన రైతులు నాణ్యతలోపాన్ని చూసి విస్తుపోతున్నారు. యూరియా అందిందని సంతోషపడాలో, నాణ్యతలేనిది ఇచ్చినందుకు బాధపడాలో తెలియక రైతులు సతమతం అవుతున్నారు. నాణ్యతలేని యూరియాను ఉపయోగించినా ఫలితం ఉండదని రైతులు చెబుతున్నారు.

కళ్యాణదుర్గం డివిజన్‌లో యూరియా సరఫరా ఇలా..

మండలం	ఆర్ఎస్‌కేలు	యూరియా వచ్చిన ఆర్ఎస్‌కేలు	సరఫరాచేసిన యూరియా
కళ్యాణదుర్గం	18	03	560
కంబదూరు	14	నిల్	నిల్
కుందుర్పి	16	03	60
శెట్టూరు	13	02	560
బ్రహ్మసముద్రం	13	06	1540
బెళుగుప్ప	14	06	1680
మొత్తం	**88**	**20**	**5300**

యూరియా కోసం రెండు నెలలుగా పడిగాపులు

అనంతపురం జిల్లాలోని ఆరు వ్యవసాయ డివిజన్‌లలో యూరియా కోసం రెండునెలలుగా రైతులు పడుతున్న అవస్థలు అన్నీఇన్ని కావు. ప్రధానంగా మొక్కజొన్న, వరి, అరటి పంటలు సాగుచేసిన రైతులకు యూరియా వాడకం అత్యంత అవసరం. ఈ నేపథ్యంలో యూరియా కోసం రైతులు ప్రయివేటు ఎరువుల డీలర్లు, వివిధ కంపెనీల దుకాణాల వద్ద పడిగాపులు కాశారు. ఇప్పటికీ అది కొనసాగుతోంది. రైతులు ఆర్ఎస్‌కెల్లో యూరియా తీసుకోవాలని వ్యవసాయాధి కారులు, ప్రజాప్రతినిధులు చేస్తున్న ప్రకటనల్లో ఏమాత్రం వాస్తవం లేకుండాపోయింది. కొన్ని ఆర్ఎస్‌కెలకు అరకొరగానే యూరియా వచ్చింది. కొరత కారణంగా రెండు బస్తాలు ఇవ్వాలని అధికారులు చెబుతున్నా ఒక్కొబస్తానే పంపిణీచేసి చేతులు దులుపుకున్నారు.



పంపిణీపై పొంతన లేని లెక్కలు

అనంతపురం జిల్లాలోని ఆరు వ్యవసాయ డివిజన్‌లలో 435 రైతుసేవా కేంద్రాలున్నాయి. ఆయా కేంద్రాలకు ఎన్ని బస్తాల యూరియా సరఫరాచేశారు.. ఎంతమంది రైతులకు పంపిణీ జరిగిందనేది వ్యవసాయశాఖ, మార్కెట్ అధికారులు గోప్యంగా ఉంచడంతోపాటు ఎవరైనా సమాధానమడిగితే దాటవేతదోరణి వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



యూరియా బాగాలేదు

రైతుసేవా కేంద్రంలో ఇటీవల తీసుకున్న యూరియా ఏమాత్రం బాగాలేదు. ఎర్రగా, నల్లగా, గడ్డలుకట్టి బస్తాముట్టులేని విధంగా ఉంది. విప్పి చూస్తే యూరియాపై అనుమానం ఉంది. గతంలో కొన్న యూరియాకు, ఇప్పుడు ఇచ్చిన యూరియాకు తేడా ఉంది. ఇది పంటలకు ఉపయోగ పడుతుందో లేదోనని అనుమానం పడుతున్నాం. బస్తాలపై వివరాలుకూడా సరిగాలేవు.

చాముండమ్మ, మహిళారైతు, బోరంపల్లి.



నాణ్యతలో లోపం వుండదు

ఆర్ఎస్‌కెలలో పంపిణీచేసిన యూరియా నాణ్యతలో ఎలాంటి లోపం ఉండదు. అన్ని నిబంధనల మేరకు సిద్ధంచేసిన యూరియాను సరఫరా చేశాం. రంగు స్వభావంలో తేడాలు ఉన్నంతమాత్రాన నాణ్యతలోపం కాదు. ఈ విషయంలో రైతులెవ్వరూ అపోహలకు లోనుకావద్దు.

యల్లప్ప, ఏడీఏ, కళ్యాణదుర్గం.

‘రోడ్డు’న పడ్డ జీవనం..!

◆ చెదిరిన చిరు వ్యాపారుల బతుకు..!
◆ హైవే వెడల్పు పనులతో కోల్పోనున్న స్వయం ఉపాధి
◆ తీవ్ర ఆందోళనలో వ్యాపారులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

చిలమత్తూరు మండలం కోడూరు తోపు బెంగుళూరు, పుట్టపర్తి కూడలి వద్ద గత 30 ఏళ్లగా చిన్న చిన్న బంకులు వేసుకొని చిరువ్యాపారాలు చేస్తున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వారు రోడ్డుకు ఇరువైపులా వేసుకున్న బంకులను హైవే వెడల్పు పనులలో భాగంగా తొలిగిస్తుండటంతో వారి జీవనం అగమ్యగోచరంగా మారింది. అది ప్రభుత్వ స్థలం (తోపు పోరంబోకు) కావడంతో ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వదు. రోడ్డు వెడెల్పుతో తమ ఉపాధి కోల్పోవటంతో తమ జీవితాలు ఎలా సాగుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రోడ్డు పక్కన తమకు వ్యాపార సముదాయం ఏర్పాటు చేసి ఇవ్వాలని వారు కోరుతున్నారు. ఉన్న షాపులను తొలగించడంతో ఖాళీగా ఉన్న గ్రామపంచాయతీ భూమిలో షాపులు ఏర్పాటు కోసం ప్రయత్నించగా గ్రామపంచాయతీ అధికారులు అక్కడికి చేరుకొని చిరు వ్యాపారులు నాటిన రాళ్లను తొలగించారు.

కుటుంబం గడపడం కష్టం

ఎం.ఆనంద్ కుమార్, కోడూరు



నేను చేతివృత్తి దారుడిని. క్షవరం చేయడం నా వృత్తి. నేను చిన్న బంకు ఏర్పాటు చేసుకుని నా వృత్తి ద్వార రోజు సంపాదన చేసుంటున్నాను. అలా వచ్చిన సొమ్ముతోనే నా కుటుంబం నడుస్తుంది. పిల్లల చదువుల కోసం చీటీ కడుతున్నాను. ఇక ఆసొమ్ము ఎలా కట్టాలో పిల్లల చదువు ఎలాగో తలచుకుంటే భయం వేస్తుంది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

వ్యాపార సముదాయం నిర్మించి ఇవ్వాలి

ప్రవీణ్ కుమార్, సిపిఎం జిల్లా నాయకులు



అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా ప్రభుత్వం రోడ్డు వెడల్పు పనులు చేపడుతోంది. 30 ఏళ్లగా ఇక్కడే వ్యాపారం చేస్తు జీవనం చేస్తున్న వారికి న్యాయంగా నష్టపరిహారం ఇవ్వాల్సి ఉంది. కాని ఆ పని చేయక పోవడం దారుణం, ఈ చిరువ్యాపారులందరికి ఈ కూడలి వద్ద గ్రామపంచాయతీ తీర్మాణంతో వ్యాపార సముదాయం నిర్మించడానికి అవకాశం ఉంది. అలా నిర్మించి వ్యాపారం మాత్రమే తెలిసిన వారికి ప్రభుత్వం బాసటగా నిలవాలి. తద్వార పంచాయతీకి ఆదాయంతో పాటు బాధిత కుటుంబాలకు న్యాయం జరుగుతుంది.

పారిశ్రామికవాడకు వెలుగులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం తూమకుంట, గోళాపురం పారిశ్రామిక వాడల్లోని ఆయా వార్డుల్లో అధికారులు వీధిలైట్లను అమర్చారు. అంధకారంలో ఉన్న పారిశ్రామిక వాడ సమస్యపై ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన కథనానికి ఏపీఐఐసీ అధికారులు స్పందించారు. ఈ మేరకు వారు మంగళవారం పారిశ్రామిక వార్డుల్లో వీధిలైట్లను అమర్చారు. ఇదే పని నెల క్రితం చేసి ఉంటే పారిశ్రామిక వాడలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో చోరీ జరిగి ఉండేది కాదని, అదేవిధంగా రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందడంతో పాటు పలువురు గాయపడేవారు కాదని కార్మికులు వ్యాఖ్యానిస్తున్నారు. విద్యుత్ దీపాలు బిగించిన విధంగానే అధికారులు పారిశ్రామిక వాడలోని రోడ్లకు ఏర్పడిన గుంతలను పూడ్చాలని తూముకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం నాయకులు, కార్మికులు కోరుతున్నారు.

అనుమతులు లేని లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోండి

ప్రజాశక్తి-పెనుకొండ

అనుమతులు లేని అక్రమ లేఅవుట్లపై మున్సిపల్ అధికారులు కొరడా ఝులిపించారు. మంగళవారం పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారి పక్కన సర్వే నెంబర్ 303,304,331 లో 2 ఎకరాల్లో వేసిన అక్రమ లేఅవుట్‌కు ఉన్న రాళ్లను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలో జాతీయ రహదారి పక్కన గల సర్వే నెంబర్ : 303, 304, 331లో 2 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ అనుమతి లేకుండా వేసిన లేఅవుట్‌ను తొలగించామన్నారు. అనధికార లేఅవుట్లను, ప్లాట్ల క్రమబద్ధీకరించుకోవడానికి ప్రభుత్వం 134 జీవోను జారీ చేసిందన్నారు. అనధికార లేఔట్, ప్లాట్లు క్రమబద్ధీకరించుకోకుండా కొందరు భూ క్రయ, విక్రయాలు చేస్తున్నారన్నారు. అలాంటి అనధికార లేఅవుట్లను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అనధికార లేఅవుట్‌లో ప్లాట్లు కొనడం వలన ప్రజలు నష్టపోతారని చెప్పారు.



అక్రమ లేఅవుట్‌లో రాళ్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

జాతీయ రహదారుల పనులు వేగవంతం చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో చేపడుతున్న జాతీయ రహదారులు, సోలార్, ఏపీఐఐసీ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జాతీయ రహదారులకు సంబంధించిన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డీవోలు, తహశీల్దార్లు, ఎన్‌హెచ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారుల పనులను నవంబర్ మొదటి వారంలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రహదారులకు సంబంధించిన భూసేకరణ ఎక్కడైనా పెండింగ్‌లో ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలని, పరిష్కారం కానీ సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని, జాతీయ రోడ్లకు ఇరువైపులా చెట్లు నాటాలని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా సోలార్ ప్లాంట్లకు సంబంధించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూసేకరణ చేసి ఎపిఐఐసి వారికి అప్పగించాల్సి ఉంటుందన్నారు. వీటన్నింటిపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎపిఐఐసి శాఖ అధికారులు, ఇంధన వనరులు శాఖ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

మహిళా పోలీసుల సమస్యల పరిష్కారానికి కృషి : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మహిళా పోలీసుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపడంతో పాటు వారు స్వేచ్ఛగా తమ విధులను నిర్వర్తించేలా సుహృద్భావ వాతావరణం కల్పిస్తామని ఎస్పీ సతీశ్ కుమార్ హామీ ఇచ్చారు. ఎస్పీగా బదిలీపై వచ్చిన సతీశ్ కుమార్‌ను పుట్టపర్తిలోని జిల్లా పోలీస్ శాఖ కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో ఎస్పీ సతీశ్ కుమార్ దంపతులను మహిళా పోలీసుల అసోసియేషన్ నాయకులు కలిశారు. రాయలసీమ జిల్లాల అధ్యక్షురాలు అమడగూరు భవాని(ఓ.డి.చెరువు) నాయకత్వంలో మహిళా పోలీసుల ప్రతినిధులు రాజేశ్వరి, కృష్ణవేణి, అనసూయ, మాధవీలత, ప్రజ్ఞ, మాధవి తదితరులు ఎస్పీ దంపతులను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారితో ఎస్పీ సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా మహిళా పోలీసులు క్షేత్ర స్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ, సిఐ, ఎస్ఐ స్థాయి అధికారుల సహకారం ఎలా ఉందని ఆరా తీశారు. త్వరలోనే మహిళా పోలీసులతో డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహించి సమస్యలు తీసుకుని వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు.



ఎస్పీని సన్మానిస్తున్న మహిళా పోలీసులు



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

దత్తత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు దత్తత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలని వివిధ శాఖలకు అధికారులు సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం హిందూపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సరస్వతి అధ్యక్షతన పి-4 కుటుంబాలకు సంబంధించి వివిధ శాఖల అధికారులకు ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. దత్తత తీసుకున్న కుటుంబాల్లో ఆర్థిక పరిస్థితులు తెలుసుకొని ఆర్థిక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఆయా కుటుంబాల్లో విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుని ఉన్నత విద్యకు సహకారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని వర్గాలతో సమానంగా దత్తత కుటుంబాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి శివకుమార్, పి4 ప్రత్యేక అధికారి శ్రీకాంత్, ఏఎస్ఓ వలీనాథ్ రావు, హౌసింగ్ ఏఈ నారాయణ రెడ్డిలతో పాటు మండలంలోని వివిధ సచివాలయాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారుల అభివృద్ధికి సహకారం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోక కళ్యాణ్ పథకాన్ని చిరు వ్యాపారులు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని మున్సిపల్ కమిషనర్ క్రాంతి కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి అధ్యక్షతన జరిగిన లోక కళ్యాణ్ అవగాహన సదస్సులో వీధి వ్యాపారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పి ఎం స్వా నిధి 2.0 లోక కళ్యాణ్ మేళా పథకం ద్వారా చిరు వ్యాపారాలు చేసుకునే వారికి విడతల వారీగా రుణాలు మంజూరు చేస్తుందన్నారు. మొదటి విడత రూ. 10వేలు, రెండవ విడత రూ. 20వేలు, మూడవ విడతగా రూ.50వేలు ఇలా పెంచుకుంటూ వ్యాపారాల నిర్వహణ కోసం రుణం మంజూరు చేయడానికి బ్యాంకర్లు ముందుకు వస్తారన్నారు. తీసుకున్న రుణాన్ని సక్రమంగా కంతుల ప్రకారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. సకాలంలో కంతులు చెల్లించే వారికి ఏడు శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుందన్నారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిస్తున్నామని చిరు వ్యాపారులు సహకరించాలని కోరారు. మెప్మా టిఎంసి రమాదేవి, లోక కళ్యాణ్ మేళ విధి విధానాలు చిరు వ్యాపారులకు వివరించారు. అనంతరం చిరు వ్యాపారులు వీధివిక్రయదారులకు ఉచిత ఆరోగ్య చికిత్సలను ఆరోగ్య సిబ్బంది అందించారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్, గ్రామీణ బ్యాంకు మేనేజర్లు, వైద్య, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న ఆవుటాల రమణారెడ్డి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి రైతులను ఆదుకోవాలని మాజీ జిల్లా అగ్రిగోల్డ్ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ లో కలెక్టర్ శ్యాం ప్రసాద్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. జిల్లాలో వ్యవసాయ పరిస్థితుల గురించి కలెక్టర్ కు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెండు లక్షల హెక్టార్లలో వేరుశనగ, కంది, మొక్కజొన్న తదితర పంటలు వర్షాధారం పైనే ఆధారపడి సాగు చేశారన్నారు. 65 వేల హెక్టార్లలో ఉద్యానవన పంటలు సాగులో ఉన్నాయన్నారు. ఇందులో మామిడి, టమోటా, వక్క, దానిమ్మ, అరటి, బొప్పాయి వంటి పంటలు ఉన్నాయన్నారు. ఈ పంటలన్నీ బోరు బావుల కింద సాగు అవుతున్నాయన్నారు అయితే మార్కెట్ సౌకర్యం లేక గిట్టుబాటు ధరలు లభించగా రైతులు నష్టపోతున్నారన్నారు. జిల్లా రైతాంగాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం ఉపాధి పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలన్నారు. అదే విధంగా చిరుధాన్యాలు, ఉద్యానవన ఉత్పత్తులకు ఆహార శుద్ధి పరిశ్రమలు ఏర్పాటుతోపాటు మార్కెట్ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లా వ్యవసాయ కృషి విజ్ఞాన కేంద్రం మంజూరు చేసిందన్నారు. ఈ కేంద్రాన్ని పుట్టపర్తి పరిసర ప్రాంతాలలో ఏర్పాటు చేసి నూతన వంగడాల అభివృద్ధికి రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పట్టు పరిశ్రమకు ప్రసిద్ధి చెందిందని పట్టు రైతులకు సరైన ప్రోత్సాహకాలు ప్రభుత్వం అందించాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి-హిందూపురం

రోజు రోజుకు దెబ్బతింటున్న పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సూచించారు. మంగళవారం పట్టణంలోని పాండురంగ నగర్‌లో స్వచ్ఛత హీ సేవా వారోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో స్వచ్ఛత హీ సేవా 2025 వారోత్సవాలలో భాగంగా పాండురంగ నగర్ ఉద్యానవన ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తను పరిశుభ్ర పరిచి, చెత్త చెదారాన్ని ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్ కు తరలించడం జరిగిందన్నారు. అదే విధంగా ప్రజలందరూ ప్రతి ఇంట్లోనూ, బయట చుట్టుపక్కల ఉన్న చెత్తాచెదారాన్ని ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నాగేంద్రమ్మ, లయన్స్ క్లబ్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, కోశాధికారి గంగాధరయ్య గుప్తా, డైరెక్టర్ గోపాల్, మునిరాజ్, అశ్వర్థ నారాయణ, నాగకుమార్, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వైసిపి మైనార్టీ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఫారూఖ్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణానికి చెందిన ఎస్ ఎం ఫారూఖ్ వైసిపి మైనార్టీ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం నుండి ఆయనకు నియామక ఉత్తర్వులు అందాయి. ఇందులో భాగంగా మంగళవారం మైనార్టీ నాయకులు స్థానిక పార్టీ కార్యాలయంలో ఫారూఖ్‌ను అభినందించారు. అనంతరం ఫారూఖ్ మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అనాకన్రు. ఈ కార్యక్రమంలో పూలకుంట బాబావలి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు సూర్య మోహన్, వార్డ్ ఇన్చార్జిలు అయూబ్ బేగ్, ఆసిఫ్ ఖాన్, డిష్ చాంద్, అంబేద్కర్ నవీన్, నాయకులు సల్మాన్, జంగం చందు ,షేక్ బాబాజాన్, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.



కార్మికులకు దుస్తులు అందజేస్తున్న దృశ్యం

పారిశుధ్య సిబ్బందికి దుస్తులు అందజేత

ప్రజాశక్తి - గోరంట్ల

గోరంట్ల మేజర్ గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు, సిబ్బందికి విజయదశమి పండగ సందర్భంగా సర్పంచ్ సరోజ నాగే నాయక్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కమలాబాయి, మాజీ ఎంపీపీ విద్యాధరణి, గ్రామ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్‌పిఎఫ్ వారోత్సవాలు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం రైల్వే స్టేషన్‌లో మంగళవారం ఘనంగా ఆర్‌పిఎఫ్ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌పిఎఫ్ అధికారులు సిఐ ఎ. నాగేశ్వరరావు, ఎస్ఐ ఏ. కోటేశ్వరరావు, ఎఎస్ఐ పుల్లయ్య, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది గొట్లూరు అనాధ ఆశ్రమంలో, ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రి లో పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశారు. రైలు ప్రయాణికులు ఆర్‌పిఎఫ్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

మేజర్ పంచాయతీకి నూతన వెలుగులు

ప్రజాశక్తి - నల్లచెరువు

నల్లచెరువు గ్రామ పంచాయతీ నూతన వెలుగులను సంతరించుకుంది. రైల్వే స్టేషన్ వీధిలో ఎల్ఈడి లైట్లను, ఎల్లమ్మ స్వామి వీధిలో వీధి లైట్లను సర్పంచి పంచరత్నమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. నల్లచెరువు గ్రామం మొత్తం లైట్లు ఏర్పాటు చేయనున్నట్లు సర్పంచి పంచరత్నమ్మ ఈసందర్భంగా తెలిపారు.

పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి - తనకల్లు

మండల పరిధిలోని తవలం పంచాయతీ గంగసానిపల్లిలో వ్యవసాయ శాఖ అధికారులు పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సేంద్రియ ఎరువుల వాడకం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. రైతులు తమ పంటలకు నానో యూరియా వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులతో పాటు వ్యవసాయ శాఖ అధికారులు భారతి, ఐసిఐసీఐ శంకర్ రెడ్డి, వేదవతి తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ : మండలంలోని అరవాండ్లపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని అధికారులు మంగళవారం నిర్వహించారు. వ్యవసాయ విస్తరణ అధికారి రంగావాని రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ శిరీష, రైతులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల ఆధునీకరణపై హర్షం

ప్రజాశక్తి - కొత్తచెరువు

రాష్ట్రంలోని గ్రంథాలయాలను ఆధునీకరణ చేసి వాటిని అభివృద్ధి చేస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శాసనసభలో ప్రకటించడం పట్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయాల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కే జయరాం, జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జె నాయక్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో మోడల్ లైబ్రరీలు నిర్మాణం, మంగళగిరిలో రూ. 150 కోట్లతో నూతన గ్రంథాలయాన్ని నిర్మిస్తామని మంత్రి తెలిపారన్నారు. 010 జీవో ద్వారా ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

ప్రజాశక్తి - కొత్తచెరువు

2025 – 26 విద్యా సంవత్సరానికి గాను ఓపెన్‌స్కూల్ సార్వత్రిక విద్యాపీఠం పదవ తరగతి ఇంటర్మీడియట్ తరగతులలో ప్రవేశానికి గడువు పొడిగించడం జరిగిందని. డీఈవో జి. కిష్టప్ప, పుట్టపర్తి విద్యాలయ అధిపతి ఎం.రాధ తెలిపారు. పదవ తరగతి చేరుటకు 14 సంవత్సరాలు ఉండాలని ఇంటర్మీడియట్ ప్రవేశానికి 15 సంవత్సరాలు నిండిన వారు అర్హులు అని అన్నారు. అక్టోబర్ 31వ తేదీ లోపల రెండు వందల అపరాధ రుసుముతో ఫీజు చెల్లించాలన్నారు.

ఓటరుజాబితా సవరణపై సమీక్ష

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పై నియోజకవర్గంలోని గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఆర్డీవో మహేష్ మంగళవారం తన కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను, ఓటరు జాబితాలో చేర్పులు, తొలగింపులు, సవరణల గురించి వివరించారు. సమగ్ర, పారదర్శక , తప్పులులేని ఓటరు జాబితా సిద్ధం కావడానికి అధికారులకు రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలని ఆర్డీవో విజ్ఞప్తి చేశారు. అనంతరం రాజకీయ పార్టీ ప్రతినిధులు తమ సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీ నాయకులు, రెవెన్యూ సిబ్బంది, ఎన్నికల సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

బిబిఎ విద్యార్థులతో విండోషాపింగ్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి మండల పరిధిలోని జగరాజు పల్లి మంగళకర డిగ్రీ కళాశాలలో మంగళ వారం ప్రిన్సిపాల్ రమేష్ బాబు, అధ్యక్షత బిబిఎ విద్యార్థులచే విండో షాపింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంగళకర విద్యాసంస్థల చైర్మన్ సురేష్ కుమార్ హాజరై ప్రసంగించారు. డిగ్రీ కళాశాల విద్యార్థులు వ్యాపార కార్యకలాపాలపై అవగాహన పెంచుకుని అభివృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రమేష్ బాబు, మంగళకర విద్యాసంస్థల మేనేజింగ్ ట్రస్టీ సురేష్ కుమార్, మంగళకర మేనేజర్ ట్రస్ట్ ఆర్య ప్రకాశ్, ఎ. జయచంద్రారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్రిసెట్‌లో గుడిబండ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - గుడిబండ

మండలంలోని మందలపల్లి, కొంకల్లు, గ్రామాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు అగ్రిసెట్‌లో ప్రతిభ కనపరిచారు. ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం పరిధిలో 2025 సంవత్సరం నిర్వహించిన ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో గుడిబండ మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. మందలపల్లి గ్రామానికి చెందిన బైలప్ప కుమలమ్మ దంపతుల కుమారుడు చంద్రశేఖర్ 120 మార్కులకు గాను 117 మార్కులు,కొంకల్లు గ్రామానికి చెందిన మంజుల శివన్న దంపతులకు కుమారుడు జనార్థన్ 120 మార్కులకు గాను 112 మార్కులు సాధించి ప్రతిభ కనపర్చారు. ప్రతిభా విద్యార్థులను పలువురు అభినందించారు.



ప్రతిభా విద్యార్థులు

సిఐటియు నాయకుడిపై దాడి అమానుషం

ప్రజాశక్తి - మడకశిర రూరల్

వెలుగు కార్యాలయ అధికారుల అవినీతిని ప్రశ్నించినందుకు సిఐటియు నాయకుడిపై దాడికి పాల్పడటం అమానుషమని, దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహశీల్దార్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు హరి, కెవిపిఎస్ జిల్లా నాయకులు రామాంజనేయులు, యోగానంద, మనూర్, మాజీ సర్పంచి ఆనందప్ప తదితరులు ఉన్నారు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రేషన్ కార్డుదారులందరికీ స్మార్ట్ కార్డ్ : జెసి

ప్రజాశక్తి - బుక్కపట్నం

జిల్లా వ్యాప్తంగా అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి రేషన్ స్మార్ట్‌కార్డును అందజేస్తామని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలో కొత్తగా ప్రభుత్వం మంజూరు చేసిన రేషన్ కార్డుల పంపిణీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ డిజిటల్ ట్రాకింగ్ సౌలభ్యంతో రేషన్ కార్డులను స్మార్ట్ కార్డు రూపంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ స్మార్ట్ కార్డులను ఏ విధంగా పంపిణీ చేయాలి అనే దానిపైన సచివాలయ ఉద్యోగులకు డీలర్లకు సలహాలు సూచనలు చేశారు.అనంతరం సివిల్ సప్లై గొడౌన్‌కోసం స్థానిక కేజీబీవీ పాఠశాల సమీపంలో స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఒ వంశీకృష్ణారెడ్డి, తహశీల్దార్ నరసింహుడు, టౌన్ కన్వీనర్ కేశప్ప తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ పై శిక్షణ

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులకు డీలర్లకు ప్రభుత్వం పంపిణీ చేసిన కొత్త రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ పై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేషన్ కార్డులను ఏ విధంగా పంపిణీ చేయాలి వాటిని ఆన్లైన్లో ఏ విధంగా నమోదు చేయాలి అనే అంశాలపై తహశీల్దార్ నరసింహుడు, సిఎస్‌డిటి అనిల్‌కుమార్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు పాల్గొన్నారు.



వృద్ధురాలికి స్మార్ట్‌కార్డు అందజేస్తున్న జేసీ

ఇసుక తరలింపులో మార్గదర్శకాలు పాటించాలి : ఆర్డీవో

ప్రజాశక్తి - బత్తలపల్లి

ఇసుక తరలింపులో ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా అనుసరించాలని ధర్మవరం ఆర్డీవో మహేష్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని జ్వాలాపురం వద్ద ఏర్పాటుచేసిన ఇసుక చెక్‌పోస్ట్‌ను బత్తలపల్లి మండల రెవెన్యూ అధికారులతో కలిసి ఆర్డీవో తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఇసుక అక్రమ రవాణాను అరికట్టే చర్యలను పరిశీలించారు. తనిఖీలలో సంబందిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని,ఇసుక రవాణా విషయంలో ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ఇసుక తరలించే వాహనాలను ఆపి సరైన ఇసుక బిల్లులు లేని వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించారు. ఇసుక తీసుకువెళ్లే లారీలు ఇతరత్రా వాహనాలు వే బిల్లులు,ఇసుక బిల్లులు కలిగి ఉండాలని చెప్పారు. పోలీసు,రెవెన్యూ,మైనింగ్ అధికారులు సమన్వయం తో పనిచేయాలని ఆదేశించారు. అక్రమ కార్యకలాపాలను అరికట్టడంలో ప్రజలు, రవాణా నిర్వాహకులు అధికారులకు తోడ్పాటు అందించాలని ఆయన కోరారు. ఈ తనిఖీలో రెవెన్యూ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో

రణభేరి బహిరంగ సభను విజయవంతం చేయండి : యుటిఎఫ్

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

ఆర్థిక, విద్యా రంగ సమస్య పరిష్కారం కోసం యుటిఎఫ్ తలపెట్టిన ఛలో గుంటూరు, రణభేరి భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, జిల్లా కార్యదర్శి నారాయణ స్వామి కోరారు. ఈ మేరకు వారు మంగళవారం పట్టణంలోని మౌర్య రెసిడెన్సీ దగ్గర యుటిఎఫ్ రణభేరి గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ ఉపాధ్యాయులకు, సంబంధించిన విద్యారంగ సమస్యలు, ఆర్థిక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ప్రధానమైన ఈ డిమాండ్‌తో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 15 వ తేదీ నుండి 19 వరకు నిర్వహించిన రణభేరి కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేశారన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి సానుకూల నిర్ణయం రాలేదన్నారు. సెప్టెంబర్ 25 వ తేదీన గుంటూరులో రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు శ్రీ సత్య సాయి జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు హాజరై సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ డివిజన్ జోన్ నాయకులు రమేష్, రవీంద్ర నాథ్, గంగాధర్, ఆదిజినేష్, రామాంజనేయులు, గోవిందప్ప, నరసింహులు, వరప్రసాద్, వెంకటనాయక్, క్రిష్టప్ప, పోతన్న తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికలు విడుదల చేస్తున్న నాయకులు

సత్యసాయి జయంతి వేడుకలకు నిధులు మంజూరు చేయండి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

నవంబర్ నెలలో సత్యసాయి శతజయంతి ఉత్సవాలు ప్రారంభం అవుతాయని అందుకు తగిన ఏర్పాట్లకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని శాసనసభ్యురాలు పల్లె సింధూర రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కోరారు. ఈ మేరకు ఆమె మంగళవారం అసెంబ్లీలో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సత్యసాయి జయంతిని అధికారికంగా నిర్వహిస్తామని ప్రకటించిందని తెలిపారు. ఈ ఉత్సవాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో పాటు, దేశంలోని పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, విదేశాలనుంచి విఐపి లు, వివిఐపీలు, గవర్నర్లు, దేశ విదేశీ భక్తులు పాల్గొంటారన్నారు. ఈ వేడుకలకు సుమారు పది లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ శత జయంతి ఉత్సవాలకు పుట్టపర్తిలో పలు అభివృద్ధి పనులు రహదారులు, డ్రయినేజీ, తాగునీరు, వైద్యం, విద్యుత్, చిత్రావతి నది సుందరీకరణ పనులకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి 105 కోట్ల రూపాయలతో డిపిఆర్ ప్రాజెక్టును చేపట్టిందన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులకు బస్సులు, రైల్వే రవాణా సౌకర్యం కల్పించే విధంగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ ఉత్సవాలకు రాష్ట్ర మంత్రులతో ఒక కమిటీ ఏర్పాటు చేసి ఏర్పాట్ల పర్యవేక్షణ చేపట్టాలని అందుకు తగిన నిధులు వెంటనే మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే కోరారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నిడిమామిడిలో 1438 నాటి 'రాజగురువు' శాసనం



శాసనాన్ని చూపుతున్న మైనాస్వామి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండలంలోని నిడిమామిడి లో గల 'శ్రీశైల జగద్గురు నిడుమామిడి సంస్థానంలో బసవన్న (నంది) విగ్రహాన్ని ప్రతిష్ఠించిన అంశాన్ని తెలుపుతున్న శాసనాన్ని గుర్తించినట్టు చరిత్రకారుడు మైనాస్వామి చెప్పారు. నిడిమామిడి వీరభద్రాలయం పక్కనే ఉన్న శ్రీశైల జగద్గురు సంస్థానాన్ని మంగళవారం సందర్శించిన సందర్భంగా శాసనాన్ని గుర్తించినట్టు ఆయన తెలిపారు. కాళయుక్తి సంవత్సరం శ్రావణమాసంలో శ్రీశైల జగద్గురు బసవరాజ మహాదేవ సజీవసమాధిపై నాటి రాజ గురువు మహా మండలాచార్య శ్రీచంద్రభూషణ దేవ మహాచార్య బసవన్న విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్టు శాసనంలో రాశారని చెప్పారు. ఇంగ్లీషు తేదీ ప్రకారం సంస్థానంలో నంది విగ్రహ ప్రతిష్ట సామాన్య శకం 1438 ఆగస్టులో జరిగిందని మైనాస్వామి వివరించారు. చిన్న రాతి పలకపై తెలుగులో శాసనాన్ని రాయగా పై భాగంలో నంది శిల్పాన్ని సుందరంగా మలిచారన్నారు. విజయనగర సామ్రాజ్య చక్రవర్తి రెండో దేవరాయల (1424-1444) కాలంలో శ్రీశైల జగద్గురు నిడిమామిడి సంస్థానాధిపతి మహా మండలాచార్య శ్రీ చంద్రభూషణ దేవ మహాచార్య రాజ గురువుగా పనిచేశారన్నారు. చంద్రభూషణ దేవ నిడిమామిడి నుంచి పెనుకొండకు, అక్కడి నుంచి హంపికి వెళ్లి రాజ గురువుగా వ్యవహరించినట్టు చరిత్రకారుడు పేర్కొన్నారు. కాగా విజయనగర సామ్రాజ్య స్థాపనలో విద్యారణ్యస్వామి రాజ గురువుగా కీలక పాత్ర పోషించగా, శ్రీకృష్ణదేవరాయల (1509-1529) పాలనలో శ్రీ వ్యాసరాయలు రాజ గురువుగా ఉన్నారన్నారు. కానీ నిడిమామిడి శాసనం ప్రకారం చంద్రభూషణ దేవ రాజ గురువుగా విజయనగర సామ్రాజ్యంలో వెలసిల్లినట్టు తెలుస్తోందని మైనాస్వామి చెప్పారు. వెయ్యి సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన శ్రీశైల జగద్గురు నిడిమామిడి సంస్థానం మూలమఠం సరైన ఆదరణకు నోచుకోలేదన్నారు. జగద్గురు మఠానికి అత్యంత విలువైన ఆస్తులు ఉన్నాయన్నారు. మఠానికి చెందిన వీరభద్ర స్వామి గుడి పునర్నిర్మాణము జరిగినా, కొన్ని వివాదాల వల్ల గుడి మూతపడడం బాధాకరమన్నారు. వీరభద్ర స్వామి గుడి పూజారి శ్రీ వీరభద్రప్ప, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు శ్రీరామచంద్రారెడ్డి, మహేష్ తదితరులు ఈ మూల మఠాన్ని సందర్శించారు.

పిహెచ్‌సి తనిఖీ

ప్రజాశక్తి - చిలమత్తూరు

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఫైరోజా బేగం సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు పట్టీ, ప్రసవాల నమోదు, మందుల నిల్వ నమోదు పుస్తకాలను పరిశీలించారు. ఆసుపత్రి గదులను పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రస్తుతం జరుగుతున్న స్వస్థ నారీ శక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం మండల స్థాయిలో ఎలా అమలవుతోందని అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో వైద్యురాలు లావణ్య, ఆయుష్ వైద్యురాలు రోజా, కమ్యూనిటీ ఆరోగ్య అధికారి జయచంద్రకుమార్, పర్యవేక్షకురాలు పద్మావతి, ఆరోగ్య కార్యకర్తలు లీలావతి, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

పోలీసుల సంక్షేమం,అభివృద్ధికి కృషి : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పోలీసుల సంక్షేమం, అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. ఉమ్మడి జిల్లా పోలీస్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం జిల్లా నూతన ఎస్పీ ఎస్ సతీష్ కుమార్‌ని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈసందర్భంగా పోలీసుల సమస్యలను నాయకులు ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే ఒక సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను తెలుసుకొని వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు తనవంతుగా సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారుల రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యకుమార్, ఉమ్మడి జిల్లాల పోలీస్ అసోసియేషన్ కమిటీ సభ్యులు త్రిలోక్‌నాథ్, గాండ్ల హరినాథ్, దాదాపీర్, సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీకి శుభాకాంక్షలు చెబుతున్న దృశ్యం

బ్యాలెట్ పద్ధతిలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించాలని సోషలిస్ట్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు ఖాదీ అంజాద్ అలీ డిమాండ్ చేశారు. మంగళవారం హిందూపురం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీన విజయవాడలో జరిగిన సోషియల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్లా ఖాన్ సాబ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అఫీజ్ అతావుల్లా ఖాన్ సాబ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఘనీ సాబ్‌లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఈవీఎం లతో ఎన్నికల నిర్వహణపై వివాదాస్పదంగా చర్చ జరుగుతున్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రజల అభిప్రాయం ప్రకారం బ్యాలెట్ విధానంతో పటిష్ట మైన భద్రతతో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నిని కోరినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దాదా పీర్, జిల్లా ఉపాధ్యక్షులు నూర్ అహ్మద్, జిల్లా కార్యదర్శి షేక్ ఉమర్, హిందూపురం అసెంబ్లీ అధ్యక్షులు షేక్ ఇమ్రాన్, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో టెంపోలో మంటలు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఆటోనగర్ లో ఆగి ఉన్న టెంపో వాహనంలో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఒక్కసారిగా మంటలు భారీగా వ్యాపించడంతో టెంపో ఇంజన్ భాగం కాలిపోయింది. గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. టెంపో ఇంజన్ భాగంలో పూర్తిగా కాలిపోవడంతో యజమానికి నష్టం వాటిల్లింది.

కర్నాటక మద్యం స్వాధీనం

హిందూపురం : హిందూపురం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించి కర్నాటక మద్యం స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీ దుర్గయ్య తెలిపారు. హిందూపురం నుండి తూముకుంట వెళ్ళే ప్రధాన రహదారిలో సంతేబిదనూరుకు క్రాస్ లో ఒకరు, అలాగే కిరికెర క్రాస్ రోడ్డులో మరొకరిని అరెస్టు చేసినట్టు తెలిపారు. ఒక్కొక్కరి దగ్గర 96 హైవార్డ్స్ విస్కీ కర్ణాటక మద్యం కలిగి ఉండగా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి, రిమాండ్ కు పంపినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలు పృథ్వీరాజ్, ఫరూక్, నారాయణ స్వామి, హెడ్ కానిస్టేబుళ్లు నరసింహ, వెంకటేష్, రమణ, సతీష్, కానిస్టేబుళ్లు అంజి, రవీంద్ర, కుమార్, రంగధామ, శివ, సుధాకర్ రెడ్డి, ఉస్మాన్, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ పనిముట్లు చోరీ

పజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ కార్యాలయ సమీపంలో రహదారిలో ఉన్న విద్యుత్ సరఫరా అవుతున్న ట్రాన్స్ ఫార్మర్‌కి చెందిన పనిముట్లను దుండగులు ఎత్తుకెళ్లారు. మంగళవారం తెల్లవారు జామున విద్యుత్ సరఫరాను నిలిపివేసి ట్రాన్స్ ఫార్మర్ కు బిగించిన కాపర్ బుషింగ్ రాడ్లు, సెక్షన్ బోర్డు లో ఉన్న అల్యూమినియం ఫ్యూజులను ఎత్తుకెళ్లారు. దీంతో ధర్మపురం ప్రాంతమంతా తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా ఆగిపోయింది. 160 కె.వి ట్రాన్స్ ఫార్మర్ కావడంతో దానికి అవసరమైన బుషింగ్ రాడ్స్ ఇక్కడ లభించకపోవడంతో విద్యుత్ శాఖ అధికారులు బెంగళూరుకు వెళ్లి అక్కడి నుంచి కొనుగోలు చేసి, తీసుకొచ్చి బిగించారు. చోరీ అయిన వాటి విలువ సుమారు రూ. 20 వేల వరకు ఉంటుందని ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ప్రధాన రహదారుల్లో విద్యుత్ సరఫరా అవుతున్న ట్రాన్స్ ఫార్మర్‌కు బిగించిన కాపర్, అల్యూమినియం లాంటి వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లారు. పోలీస్ వ్యవస్థ నిద్రపోతుండడంతోనే ఈ మధ్యకాలంలో దొంగతనాలు ఎక్కువ అవుతున్నాయన్న ఆరోపణలు బలంగా వినపడుతున్నాయి. ఇప్పటికైనా పోలీసులు నిద్రమత్తును వీడి గస్తీ పెంచి నేరాలను అదుపులోకి తీసుకురావాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - కదిరి అర్బన్

ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించాలని అంబేద్కర్ సేవా సమితి నాయకులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం ఆర్డీవో వివిఎస్ శర్మకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బహుజన ప్రజా పరిరక్షణ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఆర్ హరిప్రసాద్ మాట్లాడుతూ ఆర్డీటీ ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలను చేపట్టిందన్నారు. ప్రస్తుతం ఎఫ్‌సిఆర్ఎను నిలిపివేయడంతో నిధుల కొరతతో ప్రజా వైద్య సేవలు, పేదల ఉచిత విద్య పాటు మరెన్ను సేవలు పేదలకు దూరం అవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సేవా సమితి అధ్యక్షులు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి దిల్షాద్, బహుజన నాయకులు కలమల మునికుమార్, నసీమా, నాగరాజు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర్లకు రాయల్టీ నుంచి మినహాయింపు ఇవ్వాలి

ప్రజాశక్తి - గోరంట్ల

కొండపైన కొట్టిన రాళ్లను తరలించడానికి విధించే రాయల్టీ నుంచి వడ్డెర్లకు మినహాయింపు ఇవ్వాలని వడ్డెర సామాజికవర్గం నాయకులు కోరారు. ఈసందర్భంగా మండలంలోని గౌని వారి పల్లి పంచాయతీ కమ్మలవాండ్లపల్లి లో నివాసం ఉంటున్న వడ్డెరలు మంగళవారం స్థానిక తహశీల్దార్‌కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు ఈ సందర్భంగా వడ్డెర కులస్తులు మాట్లాడుతూ మట్లాడుతూ రాళ్లకు తరలించడానికి ట్రాక్టరుకే రూ. 1200లు రాయల్టీ విధిస్తున్నారన్నారు. ఈ పన్ను నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. క్యూక్ మీటరుకు 250 రూపాయలు రాయల్టీ వసూలు చేస్తున్నారని దీని నుంచి కూడా తమకు మినహాయింపు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.

రొద్దం ఎంపిడిఒగా ఆనంద్ ప్రసాద్

ప్రజాశక్తి - రొద్దం

రొద్దం ఎంపిడిఒగా ఆనంద్‌ప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రాప్తాడు ఇఒఆర్‌డిగా పనిచేసిన ఈయన ఉద్యోగోన్నతిపై రొద్దం ఎంపిడిఒ వచ్చినట్లు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఆనంద్‌ప్రసాద్‌కు కార్యాలయ సిబ్బంది పలువురు శుభాకాంక్షలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపిడిఒ

దళిత రణభేరికి తరలిన బీఎస్పీ నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

విజయవాడ నగరంలోని ధర్నా చౌక్ లో బుధవారం జరిగే దళిత రణభేరికి హిందూపురం నుండి బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం బయలుదేరి వెళ్లారు. విజయవాడలో జరిగే ఈ కార్యక్రమంలో నేషనల్ కోఆర్డినేటర్స్ అత్తర్ సింగ్, సురేష్ ఆర్య, బిఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతం కుమార్ తదితరులు పాల్గొన్నారు. బిఎస్పీ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు రణభేరికి బయలుదేరి వెళ్లారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - కొత్తచెరువు

గ్రామ పంచాయతీల అభివృద్ధికి కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, అధికారులు కృషి చేయాలని ఎంపీడీవో నటరాజు కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం వెర్షన్ వన్ పాయింట్ జీరో పై శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసిందని గ్రామాల్లో నెలకొన్న సమస్యల పైన ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పి ఫోర్ సర్వే గ్రామాల్లో సక్రమంగా నిర్వహించి బంగారు కుటుంబాలను ఎంపిక చేయాలని ప్రభుత్వం నుండి వచ్చే నిధులను గ్రామాల అభివృద్ధికి సక్రమంగా వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి అలివేలమ్మ, ఎంపీటీసీ రఫీ, ఏవో ఆంజనేయులు, కార్యదర్మ గంగాధర్ రెడ్డి, రాంగోపాల్ రెడ్డి, సాయినాథ్, నాగరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేతాజీ నగర్‌లో వార్డు పర్యటన

ప్రజాశక్తి-హిందూపురం

వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం లో భాగంగా చేపడుతున్న వార్డు పర్యటన మంగళవారం మున్సిపల్ పరిధిలోని నేతాజీ నగర్ లో జరిగింది. మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ తో పాటు అధికారులు వార్డులో పర్యటించి ప్రజలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ, నేతాజీ నగర్ మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అశ్వర్థ నారాయణ, అంజి, మురగేశ్, లక్ష్మీ,వార్డు ప్రజలు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి

ప్రజాశక్తి - కొత్తచెరువు

ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నందున పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని డిపిఒ సమత సూచించారు. ఈ మేరకు ఆమె మంగళవారం కొత్తచెరువులోని పలు వీధుల్లో పర్యటించారు. రోడ్ల పైన చెత్తాచెదారం వేయకూడదని ప్రజలకు సూచించారు. అన్నపూర్ణ హోటల్ వెనుక భాగాన రోడ్డుపైనే మురుగునీరు వస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతుండటంతో గ్రామపంచాయతీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి అజయ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.